సాక్షి నిజామాబాద్

మంగళవారం । 7 । జనవరి । 2025



ప్రజావాణికి 122 ఫిర్యాదులు

ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు.

- 8లో ▸



సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే వారి కోసం నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో 444 ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
30.2 /12.9

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత కొనసాగే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'మహిళా శక్తి' లబ్ధిదారులను గుర్తించాలి



డొంకేశ్వర్(ఆర్మూర్): ఇందిర మహిళా శక్తి పథకం కింద క్యాంటీన్లు, మొబైల్ ఫిష్ కౌంటర్లు, దేశీ కోళ్ల యూనిట్లు, ఇతర ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు అన్ని మండలాల్లో లబ్ధిదారులను గుర్తించాలని డీఆర్‌డీవో సాయాగౌడ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని జిల్లా కార్యాలయంలో జిల్లా సమాఖ్య కార్యవర్గ సమావేశం నిర్వహించారు. డీఆర్‌డీవో మాట్లాడుతూ.. లబ్ధిదారులను గుర్తించి జాబితాను జిల్లా కార్యాలయానికి పంపాలన్నారు. సెర్ప్ ద్వారా జిల్లాలోని ఎడపల్లి మండలంలో జాన్కంపేట్‌లో రెండు మెగా వాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇంకా ఎవరైనా ముందుకు వస్తే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. డీపీఎంలు సంధ్యారాణి, నీలిమ, సాయిలు, మారుతి, శ్రీనివాస్, స్త్రీనిధి ఆర్‌ఎం రాందాస్, ఏపీఎం సరోజిని, జిల్లా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు రాధ, లావణ్య పాల్గొన్నారు.

తెలంగాణను దోచుకున్న కేసీఆర్ కుటుంబం

- ఎంపీ అర్వింద్ ధర్మపురి



సుభాష్‌నగర్: మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం తెలంగాణను దోచుకుందని, అవినీతి ఊబిలో కూరుకుపోయిందని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. మాజీ మంత్రి కేటీఆర్ ఏసీబీ కార్యాలయానికి వెళ్లబోనని కొత్త నాటకాలకు తెర లేపుతున్నారని, ఇంకా కేసీఆర్ సీఎంగా, కేటీఆర్ మంత్రిగా, కవిత ఇంకా అధికారంలో ఉన్నామని అనుకుంటున్నారేమోనని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పుల పాల్జేసి, దశాబ్దాల పాటు అప్పుల నుంచి బయటికి రాకుండా చేశారని విమర్శించారు. వ్యక్తుల కంటే న్యాయం చాలా శక్తివంతమైనదని తెలిపారు. కేటీఆర్ చేసిన ఆర్థిక అవినీతికి శిక్ష తప్పదని, చట్టం ముందు అందరూ సమానులేనని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు.

9న మైనారిటీ కమిషన్ చైర్మన్ రాక

నిజామాబాద్ అర్బన్: రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ ఈ నెల 9న నిజామాబాద్ పర్యటనకు రానున్నారని అధికార వర్గాలు తెలిపాయి. మొదట ఈ నెల 7న వస్తారని తెలిపినా.. అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు తెలిసింది. 9న ఉదయం 10:00 గంటలకు కమిషన్ చైర్మన్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. అనంతరం మైనారిటీ వర్గాల వారి నుంచి వినతులు స్వీకరిస్తారని అధికారులు తెలిపారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని వినాయక నగర్‌లో గల ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించి, సీసీ టీవీలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన తీరును పరిశీలించారు. ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, అగ్నిమాపక శాఖ అధికారి నర్సింగ్ రావు తదితరులు ఉన్నారు.

'సంకాంత్రికి వస్తున్నాం' సందడి

- నగరంలో అట్టహాసంగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్
- హాజరైన హీరో వెంకటేశ్.. హీరోయిన్లు ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి
- తారలను చూసేందుకు తరలివచ్చిన ప్రజలు



నృత్యం చేస్తున్న హీరో వెంకటేశ్, హీరోయిన్లు మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్



వేదికపై నటుడు నరేశ్, నిర్మాతలు దిల్‌రాజు, శిరీష్, దర్శకుడు అనిల్, ఐశ్వర్య రాజేశ్, వెంకటేశ్, మీనాక్షి చౌదరి, ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ రూరల్: నగరంలో 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్ర యూనిట్ సందడి చేసింది. పాత కలెక్టరేట్ మైదానంలో సోమవారం సాయంత్రం సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను అట్టహాసంగా నిర్వహించారు. అనిల్ రావిపుడి దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా నిర్మాతలు దిల్‌రాజు, శిరీష్ ఈ సినిమాను తెరకెక్కించారు. ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్న ఈ మూవి సంకాంత్రి పండుగ (ఈ నెల14న) రోజు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో నగరంలో ట్రైలర్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ.. వెంకటేశ్‌తో తీసిన సినిమాలు అన్ని హిట్ అయ్యాయని తెలిపారు. సంక్రాంతికి వస్తున్నాం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందన్నారు. తక్కువ రోజుల్లో సినిమాను తీసిన డైరెక్టర్ అనిల్ రావిపుడిని అభినందించారు. ఇందూరు గడ్డపై సంక్రాంతికి వస్తున్నాం సినిమా ట్రైలర్‌ను విడుదల చేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. సినిమా హిట్ అవుతుందని ఆకాంక్షించారు. హీరోయిన్లు ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి వెంకటేశ్ డ్యాన్స్ చేశారు. నటుడు నరేశ్ హాజరయ్యారు. శ్రీముఖి యాంకరింగ్ చేశారు. ఎస్వీసీ మేనేజర్ నాగేశ్వర్‌రావు, నరాల సుధాకర్, సంతోష్, కొయ్యాడ శంకర్, నరాల రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న యాంకర్ శ్రీముఖి..



హాజరైన ప్రజలు

చైనా మాంజాతో పైలం!



పక్షులతోపాటు వాహనదారులకు ప్రమాదం

- ప్రభుత్వం నిషేధించినా విక్రయాలు
- తనిఖీలు చేపడుతున్న పోలీసులు

ఖలీల్‌వాడి: సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు చిన్నా పెద్ద తేడా లేకుండా గాలిపటాలను ఎగురవేస్తారు. ఈ క్రమంలో చాలా మంది ఇతర పతంగులను తెంపేయాలని చైనా మాంజా వినియోగిస్తున్నారు. ఈ దారంతో పక్షులకు, వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. సింథటిక్ దారం, గాజు పిండితోపాటు అనేక రసాయనాలను ఉపయోగించి దారంను ఉపయోగిస్తారు. దీనిని పట్టుకుంటే చేయి తెగేంతా పదునుగా ఉంటుంది. తెగిపోయిన మాంజా రోడ్లపై పడటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఉన్నాయి. చెట్లపై ఆ దారానికి చిక్కి ఎన్నో పక్షులు ప్రాణాలు విడిచాయి. ఈ నేపథ్యంలో హరిత ట్రిబ్యునల్ చైనా మాంజాను నిషేధించింది. అయినా కొందరు అమ్మకాలు సాగిస్తున్నారు.

ట్రాస్క్‌ఫోర్స్ దాడులు

నగరంలోని రెండో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గాలిపటాల షాపులపై శనివారం టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేసి చైనా మాంజాను పట్టుకున్నారు. షాపుల నుంచి రూ.10 వేల విలువైన చైనా మాంజాను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు.

- నగరంలోని పెద్దబజార్ వద్ద గల రెండు షాపులపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. రెండు షాపులలో నిషేధిత చైనా మాంజా లభించినట్లు ఎస్సై యాసీన్‌ఆరాఫత్ తెలిపారు. ఒక షాపులో రూ.4 వేలు, మరోషాపులో రూ.6 వేల చైనామాంజా లభించింది. పోలీసులు కేసు నమోదు చేశారు.
- ఆర్మూర్ పట్టణంలోని ఓ దుకాణంలో టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. షాపులో ఆరు బెండ్ల చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.6 వేలు ఉంటుంది.



నగరంలో చైనా మాంజాను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు(ఫైల్)

అమ్మినా.. కొన్నా జైలు శిక్ష

రాష్ట్ర ప్రభుత్వం 2016లో చైనా మాంజాను నిషేధించింది. పర్యావరణ పరిరక్షణ చట్టం ప్రకారం.. చైనా మాంజా విక్రయించినా, కొనుగోలు చేసినా నేరంగా పరిగణిస్తారు. దీనిని ఉల్లంఘిస్తే జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. చైనా దారంతో కలిగే నష్టాల గురించి తల్లిదండ్రులు పిల్లలకు అవగాహన కల్పించాలి. చైనా మాంజాకు బదులుగా ఇతర దారం వినియోగించాలని సూచించాలి. మాంజాతో పిల్లల చేతులు కట్ అయిన సందర్భాలు ఉన్నాయి.

కఠిన చర్యలు తీసుకుంటాం

జిల్లాలో చైనా మాంజాలను నిషేధించాం. మాంజాను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం. గాలిపటాలు ఎగురవేసే సమయంలో పక్షులు, మనుషులకు ప్రమాదాలు జరుగుతున్నాయి. చైనా మాంజా అమ్మకాలపై నిఘా పెంటాం. ఎవరైనా చైనా మాంజా అమ్మితే డయల్ 100కు గాని సంబంధిత పోలీస్‌స్టేషన్‌లకు గాని సమాచారం అందించాలి. ఇక్కడ లేదని హైదరాబాద్ ప్రాంతాల నుంచి తెచ్చుకున్న కేసులు నమోదు చేస్తాం.

– రాజావెంకటరెడ్డి, ఏసీపీ, నిజామాబాద్

సురక్షిత ప్రదేశాల్లో గాలిపటాలు ఎగురవేయాలి

- విద్యుత్ లైన్లకు దూరమైన ప్రాంతాలను ఎంచుకోవాలి
- కరెంట్ వైర్లు తెగి పడితే టోల్ ఫ్రీ నంబర్ 1912కు సమాచారమివ్వాలి
- ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రవీందర్

సుభాష్‌నగర్: విద్యుత్ లైన్లకు దూరంగా ఉన్న ప్రాంతాలు, ఖాళీ ప్రదేశాల్లో గాలిపటాలు ఎగురవేయాలని టీజీ ఎన్‌పీడీసీఎల్ నిజామాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పిల్లలు, పెద్దలు సంతోషంగా పతంగులు ఎగురవేస్తారని సురక్షిత ప్రాంతాలను ఎంచుకోవడం శ్రేయస్కరమన్నారు. గాలిపటాలు ఎగుర వేసే వారికి విద్యుత్ శాఖ పలు సూచనలు చేసిందన్నారు.

- విద్యుత్ లైన్లకు దూరంగా ఖాళీ ప్రదేశాల్లో గాలిపటాలు ఎగురవేయాలి.
- విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల వద్ద ఎగురవేయడం ప్రమాదకరం. పతంగులు, మాంజాలు విద్యుత్ లైన్లపై పడితే సరఫరాలో అంతరాయంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశముంది.
- మాంజాదారంతో ప్రమాదం పొంచి ఉంది. కరెంటు తీగలకు తాకినా మాంజా తెగిపోదు. దీంతో విద్యుత్ లైన్లు బ్రేక్ డౌన్ అయ్యే అవకాశముంది.
- గాలిపటం కరెంటు తీగలకు చిక్కుకుంటే దానిని తీసే ప్రయత్నం చేయొద్దు.
- గాలిపటాలు, మాంజాలు లైన్లపై, విద్యుత్ పరికరాలపై పడితే వాటిని వదిలేయాలి. ఒకవేళ వాటిని పట్టుకొని లాగితే విద్యుత్ తీగలు ఒక దానికొకటి రాసుకుని విద్యుత్ ప్రమాదం జరుగుతుంది.
- బాల్కనీ, గోడలు, ప్రహరీ లేని భవంతులపై గాలిపటాలు ఎగురవేయవద్దు.
- విద్యుత్ వైర్లు తెగి రోడ్డుపై పడితే వెంటనే సమీప విద్యుత్ కార్యాలయానికి సమాచారమివ్వాలి. ఎట్టి పరిస్థితుల్లో తెగి పడిన విద్యుత్ తీగలను తాకకుండా టోల్ ఫ్రీ నెంబర్ 1912కు తెలియజేయాలి.

ఇందూరుకు ఆధ్యాత్మిక శోభ



గంగాస్థాన్‌లోని ఉత్తర తిరుపతి క్షేత్రం



గణపతి సచ్చిదానంద స్వామీజీ

- ఈ నెల 9, 10 తేదీల్లో నగరంలో ఉండనున్న గణపతి సచ్చిదానంద స్వామీజీ
- గంగాస్థాన్ ఉత్తర తిరుపతి క్షేత్రంలో ఉత్తరద్వార దర్శనం ఉత్సవాల్లో పాల్గొననున్న అప్పాజీ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ముక్కోటి ఏకదాశి సందర్భంగా నగరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనుంది. ముక్కోటి ఏకాదశి పర్వదినం నేపథ్యంలో అన్ని వైష్ణవాలయాలు ఉత్తర ద్వార దర్శనానికి ముస్తాబవుతున్నాయి. ఇందుకు సంబంధించి అన్ని ప్రధాన ఆలయాల్లో ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. ఇందూరు నగరంలో ఉత్తర తిరుపతి, సుభాష్‌నగర్ రామాలయం, జెండా బాలాజీ ఆలయం, రఘునాథ ఆలయం తదితర అన్ని ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో హాజరు కానున్నారు. అయితే మైసూరులోని గణపతి సచ్చిదానంద ఆశ్రమం ఆధ్వర్యంలో నిజామాబాద్ గంగాస్థాన్‌లోని ఉత్తర తిరుపతి క్షేత్రం మరింత శోభాయమానంగా ముస్తాబవుతోంది.

- గణపతి సచ్చిదానంద స్వామీజీకి ఈ నెల 9న సాయంత్రం 6గంటలకు స్వాగత సభ నిర్వహించనున్నారు. తరువాత 7గంటలకు స్వామీజీ అనుగ్రహ భాషణం చేయనున్నారు. అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. 10న ఉదయం 10 గంటలకు స్వామీజీ దివ్యదర్శనం, పాదుకాస్పర్శ, శ్రీచక్ర పూజ, సాయంత్రం 5గంటలకు శ్రీనివాస కల్యాణం, సంకీర్తన, అనుగ్రహ భాషణం చేయనున్నారు. తరువాత అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. అదేవిధంగా 10న ఉదయం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకు ఉత్తర ద్వార దర్శనం కోసం ఏర్పాటు చేశారు.

కోట్లాది మంది భక్తులు దత్తస్వరూపంగా కొలుచుకునే మైసూరు దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ (అప్పాజీ) ఈ నెల 09, 10 తేదీల్లో ఇక్కడ నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 2004 నుంచి ఈ స్థలంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేస్తూ వస్తున్నారు. అదే ఏడాది ఉత్తర తిరుపతి ఆలయానికి సంకల్పం చేశారు. 2007లో ఇక్కడ గణపతి సచ్చిదానంద గురునిలయం నిర్మించారు. తరువాత 2015లో ఆలయ నిర్మాణం ప్రారంభించారు. 2019 ఫిబ్రవరి 15న స్వామీజీ చేసిన కుంభాభిషేకం తరువాత నుంచి ఉత్తర తిరుపతి ఆలయం భక్తులకు దర్శనమిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా సచ్చిదానంద దత్తపీఠాలు వందల సంఖ్యలో ఉన్నప్పటికీ అప్పాజీ ఇందూరుకు హాజరయ్యే విషయంలో అమితమైన ఆసక్తిని ప్రదర్శిస్తుండడం విశేషం. దీంతో ఎక్కడా లేనివిధంగా ఈ ఆలయంలో స్వామీజీ అత్యంత విలువైన మరకత శ్రీచక్రం, వినాయక, హనుమాన్ విగ్రహాలు ప్రతిష్ఠించారు. అలాగే ఇక్కడ వేంకటేశ్వరస్వామి, మహాలక్ష్మిదేవి మాత విగ్రహాలు శోభాయమానంగా దర్శనమిస్తున్నాయి. విశేషమేమిటంటే శ్రీచక్రం, వినాయక, హనుమాన్ విగ్రహాలను మైసూరు దత్తపీఠం నుంచే నేరుగా స్వామీజీ పంపడం గమనార్హం.

ఇందూరుపై అమితమైన ప్రేమ చూపిస్తారు

అప్పాజీ ఆలయం నిర్మించక ముందు నుంచి ఇందూరు విషయంలో అమితమైన ప్రేమను చూపిస్తున్నారు. మైసూరు పీఠం నుంచి మరకత విగ్రహాలు పంపారు. జిల్లాలో స్వామీజీకి భారీ సంఖ్యలో భక్తులు ఉన్నారు. ప్రతినెలా మైసూరు దత్తపీఠానికి వెళ్లివచ్చేవారు చాలామంది ఉన్నారు. ఆయన గురించి ఆలోచిస్తున్నా, మాట్లాడుతున్నా సమయం తెలియకుండా గడిచిపోతుంది. ఆయన ఆశీస్సులుంటే చాలు అన్నీ వాటంతటవే జరుగుతాయి.

– సంపత్, ఉత్తర తిరుపతి ఆలయ ఫౌండర్ ట్రస్టీ

నేడు కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం

నిజామాబాద్ సిటీ: డిచ్‌పల్లిలోని కేఎస్‌ఆర్ గార్డెన్‌లో మంగళవారం నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించనున్న సమావేశంలో ముఖ్య అతిథులుగా పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరు కానున్నారన్నారు. ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

సాగునీటిని పొదుపుగా వాడుకోవాలి



మాట్లాడుతున్న వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- రైతులకు పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచన
- రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష

బాన్సువాడ : రబీ పంటల సాగును దృష్టిలో ఉంచుకుని నిజాంసాగర్ ప్రాజెక్టునుంచి విడుదల చేస్తున్న నీటిని పొదుపుగా వాడుకోవాలని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి రైతులకు సూచించారు. సోమవారం బాన్సువాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేసి, పంటలకు కావాల్సిన సాగునీటిని రైతులు పొదుపుగా వాడుకునేలా చూడాలన్నారు. నీటిని పొదుపుగా వాడుకుంటే మిగిలిన నిజాంసాగర్ నీటితో వచ్చే ఖరీఫ్‌లో నారుమడులు వేసుకోవచ్చన్నారు. సమావేశంలో బాన్సువాడ, బోధన్ సబ్ కలెక్టర్లు కిరణ్మయి, వికాస్ మహతో, నిజాంసాగర్ ప్రాజెక్టు సీఈ శ్రీనివాస్, ఎస్ఈ రాజశేఖర్, ఈఈ బలరాం, డీఈలు జగదీష్, శ్రావణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వలకు చిక్కిన భారీ చేప

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో సోమవారం మత్స్యకారుని వలకు 25 కేజీల బరువున్న బొచ్చరకం చేప చిక్కింది. గ్రామానికి చెందిన వంక్షి దేవిదాస్ ఊర చెరువులో చేపలు పడుతుండగా 25 కేజీల చేప చిక్కింది. భారీ చేప చిక్కడంతో మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేశారు.



జిల్లాలో ఓటర్ల వివరాలు..

నియోజక వర్గం	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్	సర్వీస్ ఎలక్టోరల్	మొత్తం
ఆర్మూర్	99,657	1,14,473	6	130	2,14,266
బోధన్	1,06,999	1,17,768	5	169	2,24,941
బాన్సువాడ	94,577	1,04,145	16	201	1,98,939
నిజామాబాద్ అర్బన్	1,48,162	1,59,255	42	65	3,07,524
నిజామాబాద్ రూరల్	1,21,627	1,38,852	6	191	2,60,676
బాల్కొండ	1,06,108	1,23,512	4	72	2,29,696
మొత్తం	6,77,130	7,58,005	79	828	14,36,042

జిల్లాలో ఓటర్లు @ 14,36,042

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని నియోజకవర్గాల వారీగా తుది ఓటర్ల జాబితాను విడుదల చేశారు. జిల్లాలో మొత్తం 14,36,042 ఓటర్లు ఉన్నారు. ఇందులో సర్వీస్ ఎలక్టోరల్ ఓటర్లు 828 ఉన్నారు. పురుషుల కంటే మహిళ ఓటర్లే ఎక్కువగా నమోదయ్యారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో పురుషుల ఓటర్లు 6,77,130 మంది ఉండగా మహిళా ఓటర్లు 7,58,005 మంది ఉన్నారు. కొత్తగా చేరిన ఓటర్లు 10,372 ఉన్నారు. 5,474 ఓట్లను తొలగించారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

డిచ్‌పల్లి: తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, మహాత్మా జ్యోతి రావు పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధారణ గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి నుంచి 9 వతరగతి ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్ష టీజీసెట్ – 2025కు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు గురుకుల విద్యాలయాల సంస్థ జోనల్ –2 ఆఫీసర్ ఫ్లోరెన్స్ రాణి ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా 4 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులు అర్హులని ఆమె పేర్కొన్నారు. తల్లి దండ్రుల వార్షికాదాయం పట్టణాలలో ఏడాదికి రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాలలో రూ.1.5 లక్షలలోపు ఉండాలన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు www.tswreis.ac.in లేదా http://tgcet.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. 23 ఫిబ్రవరి 2025 న జరిగే టీజీసెట్ -2025 ప్రవేశ పరీక్షలో కనబర్చిన ప్రతిభ, విద్యార్థులు ఎంపిక చేసుకున్న పాఠశాలల ప్రాధాన్యత ప్రకారం ప్రవేశాలు ఉంటాయన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధనతో పాటు ఉచిత భోజనం, వసతి సదుపాయాలు ఉంటాయన్నారు. దరఖాస్తులు సమర్పించేందుకు తుదిగడువు 2025 ఫిబ్రవరి 1 అని జోనల్ ఆఫీసర్ తెలిపారు.

క్లుప్తంగా

బాస్కెట్‌బాల్‌లో రాణించిన క్రీడాకారులు



నిజామాబాద్‌నాగారం: స్ఫూర్తి అకాడమీ ఆధ్వ ర్యంలో హైదరాబాద్‌లో ఈ నెల 4, 5 తేదీల్లో నిర్వహించిన బాస్కెట్‌బాల్‌ అండర్‌–12, 14 విభాగంలో జిల్లా క్రీడాకారులు రాణించారు. బాలుర జట్టు అండర్‌–12 విభాగంలో రన్న ర్‌గా, అండర్‌–14 విభాగంలో తృతీయస్థానం లో నిలిచి మెడల్స్‌, సర్టిఫికెట్లు అందుకున్నారు. బాస్కెట్‌ బాల్‌ జిల్లా కోచ్‌ కేవీ కిరణ్‌కుమార్‌, కిరణ్‌రెడ్డితోపాటు అసోసియేషన్‌ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు ఎం రాజేందర్‌రెడ్డి తదితరులు క్రీడా కారులను అభినందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఇందల్వాయి: మండలంలోని ఎల్లరెడ్డిపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995–96 సంవ త్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యా ర్థులు సోమవారం అపూర్వ సమ్మేళనాన్ని ఏ ర్పాటు చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు. ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకుని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

ఎండు గంజాయి, అల్ప్రాజోలం దహనం



డిచ్‌పల్లి(జక్రాన్‌పల్లి): నిజామాబాద్‌ జిల్లా పరిధిలో డ్రగ్‌ డిస్పోజల్‌ కమిటీ (డీడీసీ) ఆమోదిం చిన 40 ఎన్‌డీపీఎస్‌ కేసులలో పట్టుబడిన ఎం డు గంజాయి, అల్ప్రాజోలంను దహనం చేసి నట్లు డీపీఈవో కే మల్లారెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం జక్రాన్‌పల్లి మండల కేంద్రంలోని శ్రీమెడికేర్‌లో రూ.58.15లక్షల విలువైన 548.15 కిలోల ఎండు గంజాయి, 3.353 కిలోల అల్ప్రాజోలంను దహనం చేశా మన్నారు.కార్యక్రమంలో ఎక్సైజ్‌ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి 444 ప్రత్యేక బస్సులు

- ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు..
- 16 నుంచి 20వ తేదీ వరకు అందుబాటులో సేవలు
- విజయవాడ వరకు స్పెషల్‌ సర్వీసులు
- వివరాలు వెల్లడించిన ఆర్‌ఎం జ్యోత్స్న



ఖలీల్‌వాడి: సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే వారి కోసం నిజామాబాద్‌ ఆర్టీసీ రీజియన్‌ పరిధిలో నుం చి 444 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఆర్‌ఎం జ్యోత్స్న సోమవారం తెలిపారు. మూడు రోజుల పాటు నడువనున్న ప్రత్యేక బస్సులు ప్రయాణికు లను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరు స్తాయని పేర్కొన్నారు. దూర ప్రాంతాలకు, ప్రత్యే కంగా ఆంధ్ర ప్రాంతానికి వెళ్శే ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్మూర్‌, బోధన్‌, నిజామాబాద్‌–1, నిజామాబాద్‌–2, బాన్సువాడతోపాటు కామారెడ్డి నుంచి హైదరాబాద్‌, విజయవాడ వరకు స్పెషల్‌ బస్సులను నడుపనున్నట్లు తెలిపారు. ప్రయాణికు లకు ఇబ్బందులు కలుగకుండా తగినన్ని బస్సు లను నడుపుతామన్నారు. ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు ఆలాగే 16 నుంచి 20వ తేదీవరకు వరకు ప్రత్యేక బస్సులు ప్రయాణికులకు అందుబా టులో ఉంటాయని తెలిపారు. సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, ఎక్స్‌ ప్రెస్‌, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రయాణ సమయంలో మహిళలు విధిగా జీరో టికెట్లను తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఆర్టీసీ బస్సుల సేవలను వినియోగించుకుని సురక్షితంగా, సుఖవంతంగా తమ ఊళ్లకు వెళ్లిరావాలని కోరారు. ప్రత్యేక బస్సు లకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్మూర్‌(73828 43133), బోధన్‌(98495 00725), నిజామాబాద్‌(99592 26022), బాన్సు వాడ(94911 05706), కామారెడ్డి (08468 220281) సంప్రదించాలని సూచించారు.

ప్రజావాణికి 122 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఉన్నతాధికారులు

- అర్జీలను పరిశీలించాలని అధికారులకు కలెక్టర్‌ ఆదేశం
- ఇళ్ల కోసం కొందరు.. పింఛన్ల కోసం మరికొందరి అభ్యర్థన

నిజామాబాద్‌అర్బన్‌: ప్రజావాణిలో అందిన అర్జీలను వెంటవెంటనే పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని అధికారులను కలెక్టర్‌ రాజీవ్‌గాం ధీ హనుమంతు ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 122 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్‌ అంకిత్‌, డీఆర్డీవో సాయాగౌడ్‌, నగర పాలక సంస్థ కమిషనర్‌ దిలీప్‌కు మార్‌, మెప్మా పీడీ రాజేందర్‌, ఇన్‌చార్జి డీపీవో శ్రీని వాస్‌, బోధన్‌ ఏసీపీ శ్రీనివాస్‌కు విన్నవిస్తూ అర్జీలు అందజేశారు. వివిధ శాఖల అధికారులు పాల్గొ న్నారు. హరితహారంలో భాగంగా నాటిన కోనోకా ర్పస్‌ చెట్లను తొలగించాలని సీపీఐ నాయకుడు సుధాకర్‌ వినతిపత్రం అందజేశారు. తమ సమస్య లను పరిష్కరించాలని కోరుతూ సివిల్‌ సప్లయీస్‌ హమాలీలు కలెక్టరేట్‌ ఎదుట ధర్నా నిర్వహించారు.

ఇంటి నిర్మాణానికి సహకరించండి



ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం అందుతుం దని ఆశించి గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించా. ఇప్పటికీ నిర్మాణ దశలోనే ఉంది. ఇప్పటికైనా ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం సాయం అందించాలి. ఇంటి నిర్మాణం సగంలో ఉంది.

– మోహన్‌, సిర్పూర్‌, మోపాల్‌ మండలం

నా భూమిని రక్షించండి



నా భూమిని బంధువులు ఆక్రమించాలని చూస్తున్నారు. అధికారులు స్పందించి నా భూమిని నాకు దక్కేలా చర్యలు తీసుకోవాలి. నా భర్త అక్కయ్య సుజాత వ్యవసాయభూమిని లాక్కునేందుకు ప్రయత్నిస్తోంది.

– ప్రియాంక, జలాల్‌పూర్‌, వర్ని మండలం

పింఛన్‌ ఇప్పించండి



నాకు రెండు చెవులు సరిగా వినిపించవు. ఇద్ద రు పిల్లలున్నారు. చా లా ఇబ్బందిగా ఉంది. అధికా రులు దయతలచని నాకు పింఛన్‌ ఇప్పించాలి.

– నందిత, నాందేవ్‌వాడ, నిజామాబాద్‌

ఇల్లు మంజూరు చేయండి



నేను దివ్యాంగుడిని. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో నా పేరు రాలేదు. అధికారులు స్పందించి నాకు ఇల్లు మంజూరు చేయాలి. నన్ను అర్హుడిగా గుర్తించాలని అధికారులను కోరుతున్నా.

– రాజు, బోధన్‌

అటవీ భూమిని కాపాడండి

వర్ని: అటవీ ప్రాంతంలోని 30 ఎకరాల భూమిని జలాల్‌పూర్‌ గ్రామానికి చెందిన కొందరు సాగు చేస్తు న్నారని మండలంలోని కూనిపూర్‌ గ్రామస్తులు కలెక్ట ర్‌కు ఫిర్యాదు చేశారు. చెట్లను నరికివేసి కబ్జా చేసిన భూమిని అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకుని ఉపాధిహామీ పథకం కింద మొక్కలను నాటాలని కోరారు. కొందరు అటవీశాఖ అధికారులు కబ్జాదారు లకు వత్తాసు పలుకుతున్నారని ఫిర్యాదులో పేర్కొ న్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ముత్తారెడ్డి రాజా రెడ్డి, కాంతారావు, పెద్దకాపు లక్ష్మారెడ్డి, పెద్ద గంగా రాం, కోతి కృష్ణారెడ్డి, సాయిలు, గిరి గంగారాం, అనిల్‌, శంకర్‌, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న కూనిపూర్‌ గ్రామస్తులు

కాంగ్రెస్‌ రైతు పక్షపాతి

- అన్నదాతకు అండగా ఉంటాం
- సాగుచేసే భూమికే రైతు భరోసా
- త్వరలో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు
- మాజీ మంత్రి, బోధన్‌ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్‌ సిటీ: పదేళ్ల బీఆర్‌ఎస్‌ అరాచక, దుర్మార్గపు పాలనకు ప్రజలు చరమగీతం పాడి కాం గ్రెస్‌ ప్రజాప్రభుత్వానికి పట్టం కట్టారని మాజీ మం త్రి, బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌ భవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బంగారు తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని, కేసీఆర్‌ చేసిన రూ.7లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు కడుతూనే సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నారన్నారు.

సాగుచేసే భూమికే రైతు భరోసా ఇస్తామని స్పష్టం చేశారు. త్వరలోనే కొత్త రేషన్‌కార్డులు, ఫ్యామిలీ డిజిటల్‌ కార్డులు ఇవ్వడంతోపాటు సం క్రాంతి తరువాత ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని తెలిపారు. విద్యార్థుల ఉత్తీర్ణత 75శాతానికి పెరి గేలా అధికారులకు సూచనలు చేశామన్నారు. కాం గ్రెస్‌ చేస్తున్న అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌ నేతలు ఆందోళన చెందుతున్నారని విమర్శించారు. కార్యక్ర మంలో డీసీసీ అధ్యక్షుడు, సహకార యూనియన్‌ చైర్మన్‌ మానాల మోహన్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మ న్‌ తాహెర్‌బిన్‌ హందాన్‌, నుడా చైర్మన్‌ కేశ వేణు, గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ అంతిరెడ్డి రాజారెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్‌ ముప్ప గంగారెడ్డి, నాయ కులు జావెద్‌ అక్రం, రత్నాకర్‌, విపుల్‌గౌడ్‌, సంతో ష్‌, బొబ్బిలి రామకృష్ణ, ఈసా, అబ్దుల్‌ ఎజాజ్‌, అప ర్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

చదువుతో పాటు క్రీడలు అవసరం

తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమని, క్రీడలతో శారీరక ధా రుఢ్యం, మానసికోల్లాసం పెంపొందుతాయని తె లంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ఎం యాదగిరి అన్నారు. ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖేల్‌ ఉత్సవ్‌ వారోత్సవాలను యాద గిరి సోమవారం ప్రారంభించారు. జాతీయ యువ దినోత్సవం, స్వామి వివేకానంద జయంతి ని పుర స్కరించుకుని ఏబీవీపీ ఆధ్వర్యంలో ఖేల్‌ ఉత్సవ్‌ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు. ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు బి శివ, రాష్ట్ర కార్యసమితి సభ్యులు అమృ తాచారి, యూనివర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్‌, స్టేట్‌ ఎగ్జిక్యూటీవ్‌ మెంబర్‌ మోహన్‌, ఉపాధ్యక్షులు పావని, నాయకులు సమీర్‌, అక్షయ్‌, అశోక్‌, లెనిన్‌, మహర్షి, నాగరాజు, నవీన్‌ పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రిజిస్ట్రార్‌ యాదగిరి

చైనా మాంజా విక్రయాలపై సమాచారం అందించాలి

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో చైనా మాంజా తయారు చేసినా, విక్రయిం చినా తమకు సమాచారం అందించాలని టా స్క్‌ఫోర్స్‌ ఏసీపీ నాగేంద్రచారి కోరారు. చైనా మాం జా కారణంగా ప్రజలతోపాటు జంతువులు, పక్షు లకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని పేర్కొ న్నారు. కొంత మంది ఇప్పటికే హైదరాబాద్‌ నుంచి నిజామాబాద్‌కు చైనా మాంజా తీసుకువచ్చిన సమాచారం ఉందని, చైనా మాంజా కలిగిన ఉన్న వారు స్థానిక పోలీస్‌ స్టేషన్‌లలో అప్పగించాలని లేనిపక్షంలో కాల్చివేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటికే 10 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. చైనా మాంజాకు సంబంధించి సమాచారాన్ని 8712 6 59812 నంబర్‌కు అందించాలని కోరారు.

క్రైం కార్నర్‌

అటవీప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని సీతాయిపల్లి అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదే హం ఉన్న సోమవారం సమాచారం అందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సీతాయిపల్లి ఫారెస్ట్‌ బీట్‌ ఆఫీసర్‌ బిలాల్‌వార్‌ రవి విధుల్లో భాగంగా అటవీ ప్రాంతంలో తిరుగుతుండగా భవానీపేట్‌ రోడ్డుకు సుమారు అర కిలోమీటరు దూరంలో బామన్‌కుంట ఎత్తుగడ్డ వద్ద చెట్టుకు ఓ వ్యక్తి ఉరేసుకుని మృతి చెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. సీఐ సంతోష్‌, ఎస్సై ఆంజనే యులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 ఏళ్లు ఉంటుందని, సుమారు 20 నుంచి 25 రోజుల క్రితం గుర్తు అటవీప్రాం తంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించామని, మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆటో బోల్తా : డ్రైవర్‌ మృతి

- ఇద్దరు విద్యార్థులకు గాయాలు

బోధన్‌ టౌన్‌(బోధన్‌): ఆటో బోల్తాపడిన ఘటనలో డ్రైవర్‌ మృతి చెందగా, ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. సోమవారం రాత్రి చోటు చేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..బోధన్‌ పట్టణంలోని ఓ ప్రైవేట్‌ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులను తీసుకుని వెళ్తున్న ఆటో బోధన్‌–పెగడాపల్లి రోడ్డులోని పెట్రోల్‌బంక్‌ వద్ద బోల్తాపడింది. ఈ ఘటనలో పెగడాపల్లికి చెందిన ఆటో డ్రైవర్‌ షేక్‌ గౌస్‌(38) అక్కడికక్కడే మృతి చెం దగా, ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. నలుగురు విద్యార్థులు రెంజల్‌ మండలం సాటాపూర్‌, నీలా గ్రామాలకు చెందిన వారు సమాచారం అందుకున్న పట్టణ సీఐ వెం కటనారాయణ ఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. గాయాల పాలైన ఇద్దరు విద్యార్థులను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్వల్పగాయాలైన మరో ఇద్దరిని వారి ఇళ్లకు తరలించారు.

దాడి ఘటనలో కేసు నమోదు

సిరికొండ: మండలంలోని పందిమడుగు తండాకు చెందిన బానావత్‌ మం జులపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్‌ రామ్‌ సోమవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మంజులకు వివాహ సమయంలో ఎకరం భూమి ఇస్తామని ఆమె అన్న బీమా, మామ ఫరంగి నాయక్‌ చెప్పారు. గత నెల 31న భూమి విషయం అడిగేందుకు బీమా, ఫరంగి వద్దకు మంజుల తన భర్త తిరుపతితో కలిసి వెళ్లింది. దీంతో వారిని దూషిస్తూ బీమా, ఫరంగి చెప్పుతో కొట్టారు. చంపేస్తామని బెది రించారు. మంజుల ఫిర్యాదు మేరకు దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సులేమాన్‌నగర్‌కు చెందిన ముగ్గురిపై..

రుద్రూర్‌: మండలంలోని సులేమాన్‌నగర్‌కు చెందిన హబీబ్‌ అనే వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. మురికి కాలువ సమస్యపై జరుగుతున్న గొడవను మాన్పించడానికి వచ్చిన హబీబ్‌పై గ్రామానికి చెందిన ముగ్గురు దాడి చేశారన్నారు. బాధి తుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసులో జైలు శిక్ష

నిజామాబాద్‌ రూరల్‌: డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసులో పట్టుబడిన ఓ వ్యక్తికి న్యాయస్థానం రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌ ఎస్‌హెచ్‌వో మహ్మద్‌ ఆరిఫ్‌ తెలిపారు. ఆదివారం రాత్రి బైపాస్‌రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా వేల్పూర్‌కు చెందిన వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడని పేర్కొన్నారు. సదరు వ్యక్తిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పరీక్ష సరిగా రాయలేదని చితకబాదిన టీచర్‌

- రెండో తరగతి విద్యార్థిపై ఉపాధ్యాయురాలి ప్రతాపం
- కేసు నమోదు చేసిన పోలీసులు
- కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేటలో ఘటన



విద్యార్థి చేయిపై ఏర్పడిన వాతలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లా నాగిరె డ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలో ఉన్న కేరళ స్కూల్‌లో ఓ విద్యార్థిని రెండురోజుల క్రితం ఉపా ధ్యాయురాలు బెత్తంతో చితకబాదింది. సదరు టీచ ర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై మల్లా రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నాగిరెడ్డిపే టకు చెందిన ఓ వ్యక్తి కుమారుడు గోపాల్‌పేటలోని కేరళ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్నాడు. బాబు ఫీజు చెల్లించాలని స్కూల్‌ యాజమాన్యం అతడి తండ్రికి ఫోన్‌ చేశారు. దీంతో తండ్రి స్కూల్‌ ఫీజు చెల్లించేందుకు తన కొడుకును తీసుకొని శని వారం స్కూల్‌కు వెళ్లాడు. ఆ సమయంలో ప్రిన్సి పాల్‌ అందుబాటులో లేకపోవడంతో ఆమెకు ఫోన్‌ చేసిన తండ్రి తన కొడుకు ఫీజును చెల్లిస్తానని చెప్పగా.. తాను ఇప్పుడు స్కూల్‌లో లేనని, తర్వాత వచ్చి ఫీజు చెల్లించాలని ప్రిన్సిపాల్‌ చెప్పడంతో అతడు తన కొడుకును స్కూల్‌లో వదిలి ఇంటికి వెళ్లిపోయాడు. కాగా అదేరోజు నిర్వహించిన పరీక్ష సరిగా రాయలేదని కారణంతో ఉపాధ్యాయురాలు బాబును చితకబాదడంతో చేతులు, కాళ్లపై వాతలు వచ్చాయి. స్కూల్‌ నుంచి ఇంటికి వెళ్లిన తమ కుమారుడి ఒంటిపై వాతలను గమనించిన తల్లిదం డ్రులు ఆదివారం అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. బాబును చితకబాదిన ఉపాధ్యాయు రాలితోపాటు స్కూల్‌ యాజమాన్యంపై తండ్రి పో లీసులకు సోమవారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. బాబును చికిత్స నిమిత్తం ఎల్లా రెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబ సభ్యులకు పిల్లల అప్పగింత

మాక్లూర్‌: ఇంటి నుంచి తప్పిపోయి వచ్చిన ఇద్దరు పిల్లలను మాక్లూర్‌ పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మం డలంలోని దాస్‌నగర్‌ వద్ద ఉన్న విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ వద్ద సోమవారం ఉదయం ఇద్దరు పిల్లలు ఏడుస్తూ రోడ్డుపై తిరుగుతున్నారని సమాచారం అందడం తో ఎస్సై రాజశేఖర్‌, హెడ్‌కానిస్టేబుల్‌ ఎంఏ అజ్మత్‌ వెళ్లి వారిని స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఆర్మూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లికి చెందిన రావుల మనోజ్‌ (7), రావుల మధుగా (5) వారిని గుర్తించారు. వెంటనే సోషల్‌ మీడియాలో షేర్‌ చేయడంతో పిల్లల కుటుంబ సభ్యులు హుటాహు టిన మాక్లూర్‌ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పిల్లలను వారివెంట తీసుకెళ్లారు. తప్పిపోయి వచ్చిన ఇద్దరు పిల్లల తల్లి సారక్క జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తుం డగా, తండ్రి ఎర్రన్న నెలక్రితం మృతి చెందినట్లు తెలిసింది. పిల్లలిద్దరూ ప్రస్తుతం వారి నానమ్మ సం రక్షణలో ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు.



చిన్నారులను నానమ్మకు అప్పగిస్తున్న పోలీసులు

అదృశ్యమైన వ్యక్తి శవమై తేలాడు



నిజాంసాగర్‌(జుక్కల్‌): అదృశ్యమైన వ్యక్తి నిజాంసాగర్‌ ప్రధాన కాలువలో మృతదేహమై తేలాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మహ్మద్‌నగర్‌ మం డల కేంద్రానికి చెందిన గోగికర్‌ కపిల్‌(32) గతేడాది డిసెంబర్‌ 18వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. సెల్‌ఫోన్‌ సైతం స్విచ్ఛాఫ్‌ రావడంతో కుటుంబ సభ్యులు పోలీ సులకు ఫిర్యాదు చేయగా, అదృశ్యం కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా సోమవారం ఉదయం బాన్సువాడ మండలం ఇబ్రహీంపేట శివారులోని నిజాంసాగర్‌ ప్రధాన కాలువలో కుళ్లినస్థితిలో కపిల్‌ మృతదేహం కనిపించడం తో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుడికి భార్య లావణ్య, కుమారుడు ఉన్నారు.

పరిస్థితి విషమించి మృతి

మాక్లూర్‌: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్‌ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని దాస్‌నగర్‌కు చెందిన సంపంగి సాయిలు(42), మక్క ప్రవీణ్‌ కూలీ పని నిమిత్తం నందిపేటకు వెళ్లి ఆదివారం రాత్రి తిరిగి వస్తుండగా గాంధీ నగర్‌ వద్ద ఎదురుగా వచ్చిన బైక్‌ ఢీకొట్టింది. ఈ ఘటనలో సాయిలు తలకు బలమైన గాయాలుకాగా చికిత్స నిమిత్తం 108 అంబులె న్స్‌లో నిజామాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతు సోమవారం తెల్లవారు జామున మృతిచెందాడు. మృతుడి భార్య సంపంగి లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్‌ స్తంభాన్ని ఢీ కొట్టిన కారు

- చెలరేగిన మంటలు.. తప్పిన పెను ప్రమాదం

కామారెడ్డి క్రైం: విద్యుత్‌ స్తంభాన్ని కారు ఢీకొట్టిన ఘటన కామారెడ్డి పట్టణంలోని రుక్మిణి కుంట ప్రాంతంలో సోమవారం చోటు చేసుకుంది. పట్ట ణంలోని రుక్మిణి కుంటలో ఈ ఘటన జరిగింది. ఇద్దరు వ్యక్తులు కారులో వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకోగా, పక్కనే పార్క్‌ చేసిన బైక్‌ ధ్వం సమైంది. కారు ఢీకొనడంతో స్తంభంపై మంటలు చెలరేగాయి. అటువైపుగా ఎవరూ రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్‌: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్టు పొతంగల్‌ తహసీల్దార్‌ మల్లయ్య సోమవారం తెలిపారు. పొతంగల్‌ మండలం సుంకిని గ్రామ పరిధిలో నుంచి ఆదివారం ఇసుక తరలిస్తున్నారని సమాచారం అందడంతో ప్రత్యేక బృందం అధి కారులు ట్రాక్టర్లను పట్టుకున్నారన్నారు. ట్రాక్ట ర్లను రవాణాశాఖ అధికారులకు అప్పగించి నట్లు తెలిపారు.



అధికారులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు